క్లుప్తంగా

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. ఉగాది పర్వదినం సందర్భంగా జెడ్పీ మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను నంద్యాల, కర్నూలు జిల్లాల టీడీపీ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. పోటీలు రసవత్తరంగా జరిగాయి. బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వృషభాలు(పెద్ద జత)నిర్ణీత సమయానికి 3513 అడుగుల దూరం లాగి తొలి విజేతగా నిలువగా రూ.1లక్షను బహుమతిగా అందజేశారు. అలాగే అదే యజమానికి చెందిన వృషభాలు(చిన్న జత) రెండవ బహుమతి రూ.80 వేలు, ఎస్ మాగులూరుకు చెందిన వజ్రాల తేజస్వనిరెడ్డి వృషభం, ఇసుకపాలెంకు చెందిన రామాంజనేయులు వృషభం(విడి జత) కలిపి మూడో స్థానంలో (రూ.60 వేలు), పల్నాడు జిల్లా బత్తుల చిన్నబ్బాల్ యాదవ్, అదే జిల్లా పిక్కల మురళి వృషభాలు(విడి జత) నాల్గో స్థానంలో (రూ.40 వేలు), ప్యాపిలి మండలం గుడిపాడుకు చెందిన అశోక్‌రెడ్డి వృషభాలు ఐదో స్థానంలో(రూ.20 వేలు), గూడూరు మండలం మునగాలకు చెందిన మహాదేవమ్మ వృషభాలు ఆరో స్థానంలో (రూ.10 వేలు)నిలవగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి

- ముగ్గురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామంలో సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ తెలిపిన మేరకు... నంద్యాల పట్టణం మాల్‌ధార్ పేటకు చెందిన జమిలాబీ కుటుంబ సభ్యులు అవుకు మండలం కునకుంట్ల వద్ద ఉన్న టెక్కుస్వామి దర్శనార్థం ట్రాలీ ఆటోలో వెళ్తుండగా గోనవరం వద్ద రోడ్డుపై ఉన్న రాళ్లను ట్రాలీ ఎక్కడంతో ఒక్కసారిగా వాహనం బోల్తాపడింది. దీంతో జమిలాబీ(75) అక్కడికక్కడే మృతి చెందింది. కరిమూల్లా, కరిస్మా, కరిమూన్‌లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం ఉన్నారు. అయితే గోనవరం సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై ఏదో వాహనం రిపేరీ రావడంతో రెండురాళ్లను తెచ్చి మరమ్మతులు చేసుకొని వాటిని అలాగే వదిలేసిపోయారు. ఆ రాళ్లను తొలగించని కారణంగా ఒక నిండు ప్రాణం గాల్లో కలిసిపోయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రేపు బండలాగుడు పోటీలు

పాణ్యం: శ్రీ హరజత్ దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈ నెల 23వ తేదీన ఎస్.కొట్టాల గ్రామంలో ఆరుపండ్లలోపు వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనుటకు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. అదేవిధంగా 24వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లా కబడ్డీ పోటీలు, గుండు ఎత్తు పందెం, సందా పందెం నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 96425 17339, 63045 94451, 96669 54464 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా చాంద్‌బాషా

పాణ్యం: వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పాణ్యం గ్రామానికి చెందిన వెల్డింగ్ చాంద్‌బాషాను మ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అభినందించి సన్మానించారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. కార్మికుల కష్టాలు తెలుసుకుని వారి అభ్యున్నతికి కృషి చేయాలని చాంద్‌బాషాకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, కరుణాకర్‌రెడ్డి, బాబు, బాబీ, పుల్లయ్య, గౌడ్, చిన్నోడు, గురురాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో ఉగాది పండగను పురస్కరించుకుని బుధవారం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాన్ని దేవాలయంలో నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ పూజారి మల్లికార్జునస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత అన్నదాన కార్యక్రమం, కొత్త సంవత్సర పంచాంగం పఠనం, భజనలు, సంకీర్తనలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

సి.బెళగల్: పెట్రోల్ బంక్ యాజమానులు వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఉద్యోగులతో కలిసి మండల కేంద్రం సి.బెళగల్‌లోని భారత్ పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను, రికార్డులు, ఆయిల్ నిల్వలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. వినియోగదారులు పెట్రోల్ బంక్‌లో ఉండే మరుగుదొడ్లు, ఉచిత గాలి పంపు సెట్ వినియోగించుకోవాలన్నారు.

ఉగాది సంబరాలకు సై

- కల్లూరు చౌడేశ్వరి దేవాలయంలో వింత మొక్కు చెల్లింపులు
- ఆలయం చుట్టూ ఎడ్లు, గార్దభాల బండ్లతో ప్రదక్షిణలు
- వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం
- రెండు దశాబ్దాలకు పైగా సంప్రదాయం కొనసాగింపు



ఉత్సవాలకు సిద్ధమైన కల్లూరు చౌడేశ్వరీ దేవి ఆలయం, ఆలయం చుట్టూ బురద ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు కల్చరల్/కల్లూరు: తెలుగు వారి తొలి పండుగ ఉగాది. యుగాది నుంచే యుగారంభం అవుతుంది. అదే క్రమంగా ఉగాదిగా రూపాంతరం చెందింది. తెలుగు సంవత్సరం ఉగాది నుంచే ప్రారంభం కావడంతో ఈ పర్వదినానికి ప్రత్యేకత ఉంది. కర్నూలు సమీపంలోని కల్లూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో నిర్వహించే ఉగాది ఉత్సవాలు రాష్ట్రంలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక్కడ ఉన్న వింత ఆచారమే ఈ ఉత్సవాలను వీక్షించేందుకు జిల్లాతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు.

రెండు శతాబ్దాలకుపైగా...

రెండు వందల సంవత్సరాల క్రితం చిన్న, పెద్ద అమ్మవారు, తట్టు, బొబ్బలమ్మ తదితర చర్మ వాధ్యులతో చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా ఇబ్బందులు పడేవారు. ఒక్కోసారి ప్రాణాలు సైతం పోయేవి. వీటి నుంచి ఉపశమనం పొందేందుకు చౌడేశ్వరి మాతను వేడుకునే వారు. తమ జబ్బులు నయమైతే అమ్మవారి ఆలయం చుట్టూ అంగ ప్రదక్షిణ చేస్తామని, తమకు ఇష్టమైన వృషభాలను ఊరేగిస్తామని మొక్కుకునేవారు. రోగాల నుంచి బయట పడ్డవారు మొక్కులు తీర్చుకునేందుకు ఆలయం చుట్టూ ఉన్న బురదలో దొర్లుతూ ప్రదక్షిణలు చేయడం, తమ ఎద్దులను అలంకరించి బురదలో ప్రదక్షిణం చేయించేవారు. ఇలా ఉగాది పర్వదినం నుంచి మూడు రోజుల పాటు ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

మొక్కులు తీర్చుకునేందుకు బురదలో ప్రదక్షిణ..

తమ కోర్కెలు తీరిన భక్తులు, రైతులు ఉత్సాహంగా ఉగాది రోజున తమ కాడి ఎద్దులతో అమ్మవారి ఆలయం చుట్టూ తిరుగుతూ ఒకరికొకరు బురద పూసుకుంటూ వేడుకల్లో పాల్గొంటారు. సుమారు రెండు వందల సంవత్సరాల నుంచి నిర్వహిస్తుండటంతో ఇది సంప్రదాయంగా మారింది. రజకులు భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పూజలు చేస్తారు. ఉగాది రెండో రోజున సంతోషంగా తమ గార్దభాలను ప్రత్యేకంగా అలంకరించి బండ్లు కట్టి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయిస్తూ కేరింతలతో సంబరాలు చేసుకుంటారు. ఈ విధంగా ఆలయం చుట్టు ఎద్దులను, గాడిదలను తిప్పడం వల్ల అమ్మవారి చల్లని దీవెనలు తమకు ఉంటాయని, రోగాల బారి నుంచి రక్షణ పొందుతామని, తమ పశువులకు ఆరోగ్యం చేకూరుతుందనేది భక్తులు విశ్వసిస్తారు. అంతేకాకుండా రైతులు సాగు చేసిన పంటలు బాగా పండుతాయనీ, తమ వృత్తిలో తోడ్పాటునందించే గార్దభాలు ఆరోగ్యంగా ఉంటాయని నమ్మకంతో ఉగాది ఉత్సవాలను జరుపుకోవడం ప్రత్యేకంగా నిలుస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది



వందల సంవత్సరాల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. రెండు వందల ఏళ్ల కిత్రమే ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని మా పెద్దలు చెప్పేవారు. అప్పుడు చర్మ వ్యాధులు ఎక్కువగా వస్తుంటే వాటి నుంచి బయట పడడానికి అమ్మవారిని మొక్కుకొని రోగం నయమైనాక మొక్కులు తీర్చుకునే వారు. ఇలా ప్రారంభమైన పండుగ ఉత్సవాల్లో రైతులు తమ ఎద్దులను, రజకులు గార్దభాలను ఊరేగించడం జరుగుతుంది. ఉగాది పండుగ మా కల్లూరుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

– కె.బాలమద్దిలేటి, కల్లూరు వాసి

వందల ఏళ్లుగా వేడుకల నిర్వహణ



ఉగాది ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశాం. ఈ పండుగ వచ్చిందంటే భక్తులు, రైతులు, రజకులు చాలా ఆనందపడతారు. వందల ఏళ్లుగా వేడుకల నిర్వహిస్తున్నారు. దేవాలయం చుట్టు నీళ్లు నిల్వ ఉంచి మొత్తం బురద మయం చేస్తాం. పండుగ రోజు సాయంత్రం ఎద్దుల ప్రదర్శన ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఎద్దులతో పాటు గాడిదలు కూడా ఆలయం చుట్టు బురదలో ఊరేగిస్తున్నారు. ఇది ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా నిలుస్తుంది. వేలాది మంది భక్తులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు.

– పోలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్, చౌడేశ్వరి దేవి ఆలయం

కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు



మాట్లాడుతున్న డీడీ దుర్గా ప్రసన్న బాబు

సి.బెళగల్: పశువులకు కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు జన్మిస్తాయని పశువర్ధకశాఖ డీడీ దుర్గా ప్రసన్న బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో స్థానిక పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ పశు కృతిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీడీ దుర్గా ప్రసన్న బాబు, డీఎల్‌డీఏ ఈఓ రాజశేఖర్ హాజరై ప్రసంగించారు. రైతులు తమ ఇళ్లలోని పశువులకు కృతిమ గర్భధారణ చేపట్టి తక్కువ ఖర్చులతో మేలుజాతి దూడలను పొందాలన్నారు. అప్పుడే పుట్టిన దూడలకు అరగంటలోపు జున్ను పాలను తాపితే వాటిలో రోగనిరోధకశక్తి పెరిగి మరణాల శాతం గణనీయంగా తగ్గుతుందని గూడూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. ఆదోని ఏడీఏ డాక్టర్ మల్లన్న బాహ్య, అంతర పరాన్నజీవుల నుంచి పశువులను రక్షించుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పశువులకు అత్యవసర, ప్రమాద సమయాలలో టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేసి సంచార పశువైద్య సేవలను పొందవచ్చని రైతులకు తెలిపారు. అనంతరం రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అదేవిధంగా పాడిరైతులకు కాల్షియమ్ టానిక్, ఖనిజ లవణాల మిశ్రమం (ఎముకల పొడి) మందులను ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తకోట పశువైద్యులు సుంకన్న, స్థానిక ఎంపీటీసీ శోభారాణి పాల్గొన్నారు.

పిల్లలపై రాజకీయం చేయడం సిగ్గుచెటు

- గురుకుల బాలికలతో ముఖాముఖీలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని, ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో పెట్టి చూడడం, రాద్ధాంతం చేయడం అలవాటైపోయిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండిపడ్డారు. పాణ్యం నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలిక పాఠశాలలో గత ఐదు రోజుల క్రితం అస్వస్థతకు గురైన బాలికలతో మంగళవారం ఎమ్మెల్యే ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సర్కారుబడులను పూర్తిగా నిర్వీర్యం చేశారని, మధ్యాహ్నం భోజనం చారునీళ్లతో సరిపెట్టారన్నారు. దీంతో పిల్లలు బడికి రావాలంటే ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. అంతేగాక ఇంగ్లిష్ మీడియం, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక తదితర పథకాలను అమలు చేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. దీంతో నేడు ప్రపంచంతో మన పిల్లలు పోటీ పడుతున్నారన్నారు. అయితే పిల్లలకు అందిస్తున్న ఆహారంపై కూడా ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు.

పిల్లల అస్వస్థతపై ఆరా:

ఎమ్మెల్యే పాఠశాలలోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి అస్వస్థతపై ఆరా తీశారు. తాము చాక్లెట్ తిన్నామని, అంగన్‌వాడీ నుంచి పిండి తిని పాఠశాలకు వచ్చామని, సాయంత్రం స్నాక్స్ తిన్నాక వాంతులయ్యాయని బదులిచ్చారు. కేవలం చాక్లెట్, పిండితిన్న వారికే మాత్రమే వాంతులయ్యాని చెప్పారు. ఇంకా ఏమైన కారణాలు ఉన్నాయా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాము తిన్న ఆహారం వల్ల కాదని వారు సమాధానం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వంటశాల, స్టాక్ రూమ్, కూరగాయలు, ఐస్‌బాక్స్‌లు, నిత్యావసర సరుకుల గడువుతేది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. చిన్నారులు చాక్లెట్ తిని అస్వస్థతకు గురైన ఘటనపై ప్రతిపక్షాలు అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే తాను బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ నుంచే పర్యవేక్షణ చేశానని తెలిపారు. ఫోన్‌ద్వారా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి సూపరింటెండెంట్ ప్రసాదరావుతో మాట్లాడి పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని కోరామన్నారు. అలాగే ఐటీడీఏ పీఓ, డీఎంఅండ్‌హెచ్, విద్యాశాఖ అధికారులతో తరుచూ మాట్లాడి పర్యవేక్షణ చేశానన్నారు. అందుకే సకాలంలో పిల్లలకు మెరుగైన వైద్యం అందిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ మాదవి, ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మీ, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓ కోటయ్య, బాబు, ప్రిన్సిపాల్ సలోమి, ప్రతాప్‌రెడ్డి, వడ్డుగండ్ల రాముడు, భాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, ఇంజినీరు మహబూబ్‌బాష, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వంట గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వైభవంగా వల్లెలాంబదేవి తిరుణాల

- నేడు అమ్మవారి రథోత్సవం


కోడుమూరు రూరల్: కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి తిరుణాల ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా మంగళవారం గోపూజ, గణపతి పూజ, గంగపూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్త పూలవాసు ఇంటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఆశీనులను చేసి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. రాత్రి అమ్మవారి ప్రభోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రమేష్‌నాయుడు, రవికుమార్‌రెడ్డి, సాలప్ప, శ్రీను గిడ్డయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోలాహలంగా గ్రామీణ క్రీడా పోటీలు:

శ్రీవల్లెలాంబదేవి తిరుణాల ఉత్సవాలను పురస్కరించుకుని కోట్ల హర్షయూత్ సభ్యులు ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడాపోటీలు ఎంతో కోలాహలంగా సాగుతున్నాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అందమైన రంగవల్లులు వేయగా, గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మొత్తం 30 జట్లు పాల్గొనగా, పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఉగాది పర్వదినమైన బుధవారం రథోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. రథోత్సవంలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు



రథోత్సవానికి ముస్తాబైన అమ్మవారి రథం

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

గడివేముల: అకాల వర్షంతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించి ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న, మిరప, మునగ, అరటి, మామిడి తోటలను ఎమ్మెల్యే పరిశీలించారు. రబీ సీజన్‌లో పంటనమోదు చేయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షంతో నియోజకవర్గంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది నివేదికలు సిద్ధం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పంటలకు నష్టం జరిగితే రైతులకు పరిహారం అందడానికి రెండు, మూడు సంవత్సరాలు పట్టేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ సీజన్‌లో నష్టం జరిగితే ఆ సీజన్‌లో పరిహారం అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నష్టపోయిన రైతుల జాబితాను తయారు చేసిన ప్రభుత్వానికి అందించాలన్నారు. పరిహారం అందించడంలో నిజమైన రైతులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. కౌలు రైతులకు, ఇనాం భూములు సాగు చేస్తున్న వారికి కూడా పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ విజయసింహారెడ్డి, ఏఓ హేమసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, నంద్యాల జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ కాలునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, మేఘునాధరెడ్డి, పెసరవాయి శ్రీకాంత్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, కత్తి తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు రాగిజావ పంపిణీ

కోడుమూరు రూరల్/పాణ్యం/కర్నూలు(న్యూటౌన్): ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నదే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోడుమూరు మండలంలోని కొండాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని కుడా చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులంతా కడుపు నిండా భోజనం చేయడంతో పాటు, చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసేందుకు కుట్రలు పన్నిందని, అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టి ఉన్నత విద్యను వారి దరికి చేర్చిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నరహరిదాసు, హైస్కూల్ హెచ్ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

- పాణ్యం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీపీ ఉసేన్‌బీ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంఈఓ కోటయ్య విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. నగర శివారులోని మిలిటరీ కాలనీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామపెద్దలు వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ హెచ్ఎం సుధీంద్రకుమార్ విద్యార్థులకు రాగిజావ అందజేశారు. కార్యక్రమంలో నందనపల్లి గ్రామ సర్పంచ్ కొండూరు మాధురి భర్త వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సి.బెళగల్/గడివేముల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ బొంతల మునెప్ప, ఎంఈఓ జ్యోతి ఎంపీడీఓ రాముడు హాజరై విద్యార్థులకు రాగిజావను పంపిణీచేశారు. స్థానిక మోడల్, సి.బెళగల్ రెగ్యులర్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ పాండురంగన్న, స్థానిక నాయకులు, పీఎంసీ చైర్మన్లు విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గడివేముల మండల కేంద్రమైన గడివేముల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, హెచ్ఎం దస్తగిరమ్మ రాగిజావ అందజేశారు.

రాష్ట్రంలో విద్యకు పెద్దపీట : మేయర్ బీవై రామయ్య

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం మెనూలో మరో పోషకాహారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. ముందుగా పాఠశాలలో నాడు- నేడు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో విద్యకు వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి కేవలం రూ.450 కోట్లు కేటాయించి, కమీషన్లకు కక్కుర్తిపడి పిల్లలకు నాసిరకమైన భోజనం అందించేవారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికే రూ.1,824 కోట్లు వెచ్చిందన్నారు. తాజాగా రాగిజావ కోసం ఏటా మరో రూ.86కోట్ల ఖర్చు పెట్టబోతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కుమార్‌రెడ్డి, సిబ్బంది, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 29వ వార్డులోని మండల పరిషత్ పాఠశాలలో కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి విద్యార్థులకు రాగిజావ అందించారు.





విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య



కొండాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావను అందజేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 35వ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. అంతేగాక విద్యార్థులకు మరింత పోషకాహారం అందించడం కోసం జగనన్న గోరుముద్దలో రాగిజావను చేర్చడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: ఓర్వకల్లు జెడ్పీ హై స్కూల్‌లో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.